# ఆదర్శ ప్రేమ



పట్లూరి ఈశ్వరచంద్ర విద్యాసాగర్

రైలు తప్పిపోవడం, ప్రయాణాల్ని వాయిదా వేసుకోవడం నాకు ఇంచుమించు 'అలవాటు'.

కాని ఆ రోజు మాత్రం అలా జరగడానికి వీల్లేదు. ఏ విధంగానైనా సరే ఆ రైల్లో విజయవాడలో దిగి భాస్కరన్ వూరికి వెళ్ళాలి. అందుకే ఆరు గంటలకు రైలుంటే అయిదున్నరకే ప్లాట్‌ఫారం మీద టికెట్‌తో నిలుచున్నాను.

రైలు రైట్ టైముకే బయలుదేరింది. కిటికీ పక్కనే సీటు దొరికింది. కిటికీలోంచి ఉధృతంగా గాలి వీస్తున్నా, ప్రకృతి రమ్యంగా కనిపించడంతో అక్కడే కూర్చోవాలనుకున్నాను. వెనక్కి చేరగిలబడి లోపలి పక్క సీట్లో కూర్చున్న వాళ్ళని ఒకసారి చూశాను. ఎవరో ఉత్తరం చదువుతూ కనిపించారు. అప్పుడు భాస్కరన్ రాసిన ఉత్తరం జ్ఞాపకం వచ్చింది. వెలికి తీసి విప్పాను.

"డియర్ ఎస్. ఆర్.,

చాలా సంవత్సరాల తరవాత బహుశః ఇది మొదటి ఉత్తరం అనుకుంటాను. మరి నీవుకూడా రాయలేదేమిటి? భార్యా బిడ్డలతో జీవితాన్ని బిజీ చేసుకుని ఉంటావు. (అవునూ ఇంతకీ పెళ్ళి చేసుకున్నావా ) ఇప్పటి నీ స్థితి గురించి నా కేమీ తెలీదు. కాని మనం కలిసి బతికిన ఆ రోజులు బాగా జ్ఞాపకం ఉన్నాయి.

ఇక నా స్థితి—డాక్టర్‌గా బాగా సంపాదించాను. ఇప్పుడు అంతా పోగొట్టుకుని జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్నాను. నాకు ఒకోసారి అనిపిస్తుంది జీవితం చివరి అధ్యాయంలో ఉన్నానేమో అని. ఎందుకో ఒకసారి నిన్ను చూడాలనీ, సంతృప్తిగా మాట్లాడాలనీ ఉంది. నేను వచ్చే స్థితిలో లేను. అందుకే వీలు

చూసుకుని ఈ స్నేహితుడిపై దయ ఉంచి మా వూరికి ఒకసారి వస్తావని ఆశిస్తున్నాను.

ఇట్లు
నీ ప్రియమైన స్నేహితుడు
భాస్కరన్."

ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకుని సిగరెట్ వెలిగించాను. ఏవేవో జ్ఞాపకాలు. సరదాగా హుషారుగా జీవితాన్ని అనుభవించిన రోజులు. సినిమా రీళ్ళ మాదిరిగా మస్తిష్కంలో కదలసాగాయి.

● ● ● ●

చాలా సంవత్సరాల క్రితం మాట. అప్పట్లో హైదరాబాద్‌లో ఒక గూట్లో రెండు పక్షులు నివసిస్తుండేవి. మొదటి పక్షి మెడికల్ కాలేజీలో శవాల్ని, అస్థిపంజరాల్ని ముక్కుతో పొడుస్తుంటే రెండవది యూనివర్సిటీ కాలేజీలో ఎం. ఎ. పై కాలజీని అధ్యయనం చేస్తుండేది.

మొదటి పక్షికి మనిషంటే ఏనాటమీ. ఎముకల గూడు. కణాల సముదాయం. ఒక యంత్రం.

రెండవ పక్షికి మాత్రం మనిషంటే సంఘజీవి. జీవితమంటే ఒక ఆరాటం. ఆశలకు, నిరాశలకు, కోరికలకు, నీతి నియమాలకు, సంప్రదాయాలకు, నాగరికతకు మధ్య నిరంతరంగా జరిగే సంఘర్షణ, పోరాటం. ఆ మొదటి పక్షి భాస్కరన్ అయితే రెండవ పక్షిని నేను. పోతే చదువుకునే రోజులు వేరు. ఆ కాలంలో యువకులకి ఉండే ఆవేశం, పట్టుదల వేరు. చదువు పూర్తయి ఏదో ఒక ఉద్యోగం కోసం వేటాడేటప్పుడు ఉండే భావాలు వేరు. ఏదో ఒక ఉద్యోగం దొరికితే అప్పటి పరిస్థితి పూర్తిగా వేరు.

"ఆదర్శ ప్రేమ అన్నదో యుటోపియన్ కాన్సెప్ట్ అది మనిషి తనలో దాగి ఉన్న సెక్సువల్ ఇన్‌స్టింక్ట్‌కి పెట్టుకున్న అందమైన పేరు. రోమియో జూలియట్ లైలామజ్నూ, దేవదాసు- ఇవన్నీ వాస్తవానికి అతి దూరమైన కథలు. కేవలం ఒక రచయిత రసానుభూతి కోసం కల్పించిన కథలు. వయసులో ఉన్న ఒక అబ్బాయి ఒక అమ్మాయిని ప్రేమించడం, ప్రేమ విఫలమైతే ఆమెకోసమే జీవితాంతం ఒంటరిగా జీవించడం లేదా ఒక అబ్బాయిని అమ్మాయి ప్రేమించడం అతని కోసం ప్రాణాలు తీసుకోవడం అంటే నేను ఒప్పుకోను."

ఎప్పుడైనా నేను ప్రేమ గురించి భాస్కరన్‌తో మాట్లాడితే సరి, ఇలా సాగేది వాడి వాదన చదువుకొనే రోజుల్లో.

కొన్నేళ్ళ తరవాత నాకు అదే యూనివర్సిటీ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం దొరికితే, భాస్కరన్‌కి ఉద్యోగం దొరక్క ప్రైవేట్ ప్రాక్టీస్ ప్రారంభించాడు. అయితే ఆ మధ్య ఒక రోజు ఒక సంఘటన జరిగి ఉండక పోతే భాస్కరన్‌ను మరిచిపోయి ఉండేవాడినేమో.

ఆ రోజు ఫస్ట్ షో సినిమాకి వెళ్ళి యూనివర్శిటీ కాంపస్‌లోనే అద్దెకు తీసుకున్న రూముకు వచ్చేసరికి పది దాటింది. ఒంటరి జీవితం. పన్నెండు దాటితే కాని నిద్ర పట్టదు.

"మాస్టారూ. మాస్టారూ" తలుపులు గట్టిగా బాదుతూ ఎవరో పిలిచేసరికి మంచం పైనుంచి లేచి హేంగర్‌కి వేలాడుతున్న షర్ట్ వేసుకుని ద్వారం వైపుకి నడిచాను. పరిచయమైన కంఠంగానే తోచింది.

తలుపులు తెరిచేసరికి ఎదురుగా తల మీదుగా కొంగు కప్పుకుని నిలుచున్న సరితను చూసి ఆశ్చర్యపోయాను.

"సరితా! నువ్వా...ఇంత రాత్రి పూట."

"చాలా అర్జంటు పనుండి వచ్చాను."

"అర్జంటు పనా."

"అవును. మీరు లోపలికి రానిస్తే అంతా వివరంగా చెబుతాను."

"అరెరె...లోపలికి రానివ్వడం ఏమిటి. రా.రా."

అప్పటివరకు ద్వారానికి అడ్డంగా నిలుచుని మాట్లాడుతున్నానన్న సంగతే జ్ఞాపకం రాలేదు. పక్కకు జరిగి సరితకి దారిచ్చాను. ఒకే గది అయినా విశాలంగా ఉండడంతో ఒక టీపాయ్. నాలుగైదు కుర్చీలను అమర్చ గలిగాను. ఇద్దరం ఒకరి కెదురుగా ఒకరం కుర్చీల మీద కూర్చున్నాం.

"ఆ...ఏమిటి అంత అర్జంటు పని."

"ఇదిగో. ఈ ఉత్తరం చదవండి" అంటూ సరిత ఒక ఉత్తరాన్ని అందించింది.

ఆ అర్ధరాత్రి సరిత ఒంటరిగా రూముకు రావడం, ఉత్తరం ఇవ్వడం ఇవే మీ అర్థం కాక పోయినా ఆత్రంగా ఉత్తరాన్ని విప్పాను.

"డియర్ సరితా: భాస్కరన్‌ని మరిచి పోలేక పోతున్నాను. అతను లేకుండా ఒంటరిగా బతకడం అటుంచి కనీసం ఆ బతకడాన్ని వూహించినా భరించ లేకపోతున్నాను. అమ్మా నాన్నల సంగతి తెలుసుగా విషం తాగి చావడానికైనా సిద్ధంగా ఉన్నారు కాని మా పెళ్ళికి ఒప్పుకోరు. అందుకే బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. ఈ రోజు పడుకునే ముందు ఈ ఉత్తరం రాసి స్లీపింగ్ పిల్స్ మింగాను. నీకు దూరంగా వెళ్ళిపోతున్నందుకు.

నన్ను క్షమిస్తావు కదూ...
ఇట్లు నీ
ప్రియమైన సంధ్య."

సరితతోబాటు సంధ్య కూడా ఎమ్.ఎ. మొదటి సంవత్సరం చదువుతోంది. వాళ్ళ అభిమాన లెక్చరర్ని నేను. అప్పుడప్పుడు భాస్కరన్ నాకోసం రూముకు రావడంతో సంధ్యకు భాస్కరన్‌తో పరిచయం ఏర్పడిందన్న సంగతి నాకు తెలుసు. కాని వాళ్ళ పరిచయం ప్రేమగా మారి, అది ముదిరి ఇంతవరకు వస్తుందని వూహించలేదు.

ఉత్తరాన్ని మడిచి సరిత చేతి కందిస్తూ నిట్టూర్చాను.

"ఫ్రెండ్సంతా కలిసి సెకండ్ షో సినిమాకి వెళ్ళాం. తనను రమ్మని ఎంత బలవంతం చేసినా రాలేదు. హాస్టలుకు వచ్చే సరికి ఈ ఉత్తరం ఉంది. సంధ్యను తట్టి లేపినా లేవడం లేదు. ఎటూ తోచక మీవద్దకి పరుగెత్తుకొచ్చాను."

సరిత ఎందుకోసం వచ్చిందో అప్పటిగ్గాని నాకు అర్థం కాలేదు. "ఓ మై గాడ్ ... అయితే హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళలేదా ... మరి అప్పట్నుంచి చెప్పవేం ... పద ... పద."


రూముకు తాళం వేసి హాస్టలుకు పరుగెత్తాం ఇద్దరం.

హాస్టల్ వార్డెన్‌కు మాత్రమే జరిగిన సంగతి చెప్పి అల్లరి జరక్కుండా సంధ్యను ఆ రాత్రి హాస్పిటల్లో చేర్పించేసరికి రెండు దాటింది. పరిస్థితి అదుపులో ఉందని డాక్టర్ చెపితే 'హమ్మయ్య' అనుకున్నా. మరో నాలుగు రోజులదాకా సంధ్య హాస్పిటల్లోనే ఉండి పోవలసి వచ్చింది. ఆ తర్వాత సంధ్య కాంపస్‌లో మళ్ళీ కనపడలేదు. చదువు పూర్తయి సరిత కూడా వెళ్ళిపోయింది.

● ● ● ●

కళ్ళు తెరిచేసరికి రైలు వరంగల్ స్టేషన్‌లో ఆగి ఉంది. ప్లాట్‌ఫారం మీద అల్లరి. సందడి. మళ్ళీ కళ్ళు మూసుకున్నాను.

రైలు కదిలి స్టేషన్ దాటిన తర్వాత కాని మళ్ళీ కళ్ళు తెరవలేదు. కళ్ళు తెరిచి చూస్తే ఎదురుగా ఉన్న సీట్లో ఆమె!




కాస్త ఒళ్ళు వచ్చి వయస్సులో పెద్దదానిలా కనిపిస్తోంది. అవేకళ్ళు. నొసటిమీద ఉంగరాలుగా తిరిగి గాలికి దోబూచులాడుతున్న ముంగురులు. మరోసారి చూసి పోల్చుకోగలిగాను.

సంధ్య! ఆ వింతగా జరిగిన కోయిన్సిడెన్స్‌తో సంతోషపడినా సంధ్య వాలకం చూసి భయపడ్డాను. మెడలో మంగళసూత్రం, కాళ్ళకు మెట్టెలు. తొడ మీద ఓ మూడేళ్ళ అబ్బాయిని పడుకోబెట్టుకుని ఉంది. 'అంటే సంధ్యకు పెళ్ళయిందన్న మాట! మరి భర్త ఎవరు? భాస్కరన్‌కోసం ప్రాణాలు తీసుకోవడానికి సిద్ధపడ్డ ఆ నాటి సంధ్యేనా ఈ సంధ్య. ఆలోచనల్లోంచి తేరుకుని చిన్నగా దగ్గాను సంధ్య నా వైపుకి చూస్తుందన్న ఆశతో.

సంధ్య అనుకున్నట్లే నా వైపుకి తిరిగి నన్నోసారి చూసింది. కళ్ళు విప్పారాయి.

"మాస్టారూ ... నమస్తే."

"నమస్తే... నన్ను గుర్తుపట్టావా, సంధ్యా!"




"మిమ్మల్ని గుర్తించక పోవడమేమిటి మాస్టారూ! ఇప్పు డెక్కడున్నారు? వో. యూ. లో నేనా?"

"అక్కడే."

నన్ను 'ఎక్కడికి వెళుతున్నారు' అని అడగలేదు. అడిగితే భాస్కరన్ ఉత్తరం సంగతి చెప్పాలనికూడా నేను అనుకోలేదు. సంధ్య గురించి ఆమె ఆ నాటి ప్రేమ గురించి ఎన్నో ప్రశ్నలు వేయాలనుకున్న నేను, సంధ్య వద్దకు వచ్చి ఆగిపోయిన అతిన్ని చూసి ఆగిపోయాను.

పింక్ కలర్ స్ట్రైప్స్ ఉన్న ఫుల్ షర్ట్. తెల్ల ప్యాంటు. కళ్ళకి గాగుల్స్. చూస్తూనే వో ఆఫీసర్ అని అందరూ అనుకునేలా ఉన్నాడు అతను.

ఎవరు అన్నట్లు సంధ్యవైపుకు తిరిగి చూశాను.

"మా వారు. హనుమకొండలో బ్యాంక్ మేనేజర్. అతనికి నా గురించి చెప్పింది.

"నమస్తే."

నేను ప్రతినమస్కారం చేశాను.

'అంటే వీళ్ళ ప్రయాణం హనుమకొండదాకే అన్న మాట. అతను అబ్బాయిని భుజాల మీదికి తీసుకుంటూ సంధ్య ప్రక్కన కూర్చున్నాడు. ఏమేమో అడగాలని ఉంది సంధ్య గత జీవితం గురించి. కాని ఎలా? అతను అక్కడే ఉన్నాడు. ఎటూ తోచక "మీ అబ్బాయా" అన్నాను.

"అవును, మాస్టారూ. ఒక్కడే. తర్వాత ఆపరేషన్ చేయించుకున్నాను. అత్తయ్యకి వో ఆడపిల్ల కలిగే వరకు ఆగాలని ఉండేది. కాని మావారికి ఇష్టం లేకపోయింది."

ఒకనాడు స్త్రీ స్వేచ్ఛ గురించి బల్లగుద్ది వాదించే సంధ్య ఈ నాడు ఎంతగా మారిపోయింది. సాధారణమైన వో ఇల్లాలు ఎలా మాట్లాడుతుందో అలాగే మాట్లాడుతూంది. ఎంత మార్పు!

స్టేషన్ వచ్చేసింది.

ట్రెయిన్ దిగి కిటికీలోంచి గుడ్‌బై చెబుతూ వాళ్ళు వెళ్ళిపోయారు.

నేను వాళ్ళు కనుమరుగయ్యేవరకు చూస్తూ తర్వాత నిట్టూర్చడం తప్ప మరేమీ చెయ్యలేకపోయాను.

● ● ● ●

విజయవాడలో రైలు దిగి రిక్షాలో కృష్ణలంకకు వెళ్ళాను. కృష్ణలంకలోనే భాస్కరన్ మకాం. పోలీస్ స్టేషన్ పక్క ఇల్లు. ఇంట్లో తల్లి తను తప్ప మరెవ్వరూ లేరు. నన్ను చూస్తూనే వాడు సంతోషాన్ని పట్టలేక నా చేతిని తన చేతిలోకి తీసుకుని ఆనంద బాష్పాలు రాల్చినా నాకు మాత్రం సంతోషంతోపాటు బాధకూడా కలిగింది.

భాస్కరన్ ఒక గదిలో మంచం మీద వెల్లకిలా పడుకున్నాడు. ఆ గది వాలకం, వాడు పడుకున్న తీరు చూస్తుంటే వాడు దీర్ఘవ్యాధిగ్రస్థుడిలా కనిపించాడు నాకు.

"ఏమిట్రా ఇదంతా."

"చివరి ప్రయాణానికి సన్నాహం." .

"భాస్కరన్" గట్టిగా అరిచాను.

"అవున్రా. నా రోజులు ముగిసిపోయాయి. నా జీవితకాలం రోజుల్లోకి వచ్చేసింది."

వా డేం మాట్లాడుతున్నాడో నా కర్థం కాలేదు.

"అర్థం కావడం లేదు కదూ, చెబుతా విను. హైదరాబాద్‌లో సంధ్య పరిచయం, విడిపోవడం జరిగిన తరవాత అక్కడ ఉండలేక ఇక్కడి కొచ్చాను. ఇక్కడ మరీ భరించ రాకుండా అయింది పరిస్థితి. ప్రైవేటు ప్రాక్టీసు ప్రారంభించినా వృత్తిపై ధ్యాస లేకుండా పోయింది. ఏదో విసుగు, నిర్లిప్తత, జీవితంపై నిరాశ. చచ్చిపోవాలన్న ఇన్‌స్టింక్ట్ పెరగడం. ముందు ఎంత మెటీరియలిస్టుగా ఉండేవాన్నో అంత వేదాంతిగా మారిపోయాను. ప్రతిక్షణం ఆమె జ్ఞాపకాలే. తరవాత ఆమెను కలుసుకోవడానికి ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దానితో ఇంకా పిచ్చెక్కి మనోవ్యాధితో మంచం పట్టాను."

"భాస్కరన్! ఇంత బలహీనుడవనుకోలేదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. సంధ్యను మరిచి పోవడానికి ప్రయత్నించు."

"లేదురా—అంతా మించిపోయింది. నా కేం వ్యాధో తెలుసా నీకు."

"ఏమిటి."

"లుకేమియా"

అదిరి పడ్డాను. పరిసరాలు తలకిందులుగా కన పడ్డాయి ఆ క్షణంలో.

"భాస్కరన్!"

"అందుకే చెబుతున్నానుగా జీవితం రోజుల్లోకి వచ్చేసిందని.

15—2—84

ఇలా జరిగినందుకు నాకు బాధ లేదు. జీవచ్ఛవంలా బతకడం కంటే చావడం మేలు. ఆత్మహత్య కాకుండా ఇలా నాచురల్‌గా చావడం చాలా బాగా అనిపిస్తుంది నాకు. కాని చనిపోయే ముందు ఒక చిన్న కోరిక."

"ఏమిటి."

"ఆ బీరువాలో కొన్ని డైరీలు. పిచ్చిగా రాసుకున్న కాగితాలు ఉన్నాయి. ఎలాగైనా సంధ్య అడ్రస్ తెలుసుకుని వాటిని ఆమెకు అందించాలి. భౌతికంగా ఆమెకు దగ్గర కాలేకపోయినా, నా డైరీల ద్వారా అయినా ఆమెకు దగ్గర కావాలని నా కోరిక. ఈ పని నీవు ఒక్కడివి మాత్రమే చేయగలవని నా నమ్మకం. అందుకే చివరి ఘడియల్లో నీ సహాయాన్ని కోరి నిన్ను రమ్మని ఉత్తరం రాశాను. నా కోరిక తీరుస్తావు కదూ."

ఎంత ఆపుకోవాలనుకున్నా కన్నీళ్ళు ఆగలేదు. గొంతులో మంట. మాటలు పెగలడం లేదు. రైల్లో సంధ్య కలిసినట్లు భాస్కరన్‌కి నే నింకా చెప్పలేదు. ఈ సమయంలో ఆమె గురించి చెప్పడం వల్ల భాస్కరన్ బాధ పెరుగుతుందే తప్ప మరో ప్రయోజనం ఉండదని అనుకున్నా. అందుకే ఏ విషయాన్నీ ప్రస్తావించకుండా భాస్కరన్ కోరిక తీరుస్తానని మాట ఇచ్చాను. భాస్కరన్ జీవితం రోజుల్లోకి వచ్చేసిందన్న విషయాన్ని భరించలేని నాకు అది గంటల్లోకి వచ్చేసిందని తెలిసి పిచ్చి ఎక్కినట్లయింది.

ఆ రోజు రాత్రి భాస్కరన్ పరిస్థితి హఠాత్తుగా విషమించింది. ఇద్దరు డాక్టర్లు పర్యవేక్షిస్తున్నా వాడిని కాపాడలేకపోయారు. తల్లి భోరుమని ఏడ్చింది.

అక్కడే ఉండి అంతా ముగించి భాస్కరన్ సమాధి మీద పూలుంచి, డైరీలు తీసుకుని తిరుగు ప్రయాణం కట్టాను

"మాస్టారూ! నమస్కారం!" కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తున్న వాడినల్లా ఆలోచనలకు స్వస్తి చెప్పి కళ్ళు తెరిచి చూశాను.

ఎదురుగా ఉన్న సీట్లో కూర్చోనుంది సరిత.

రైలు చాలా వేగంగా పరుగెత్తుతున్నట్లు టకటక శబ్దం ఉధృతంగా వినిపిస్తుంది.

"వో! సరిత." తెల్లచీర— తెల్ల జాకెట్. ముప్పై ఏళ్ళ అందం. ఇంకా కన్యగానే కనిపించింది. సరితను చూడడం ఆనందంగా అనిపించినా ఇంకా కన్యగా కనిపించడం బాధగా అనిపించింది.

"ఎక్కడికి, మాస్టారూ?"

"హైదరాబాద్‌కి."

తరవాత భాస్కరన్ కథ చెప్పాను. కథ వింటూ ఓర్చింది సరిత. నిశ్శబ్దంగా ఉండిపోయింది.

"ఇప్పుడేం చేస్తున్నావు, సరితా?" నే నడిగాను తరవాత ఏం మాట్లాడాలో తోచక.

"హనుమకొండలో ఒక మిషనరీ స్కూల్లో టీచరుగా..."

అందుకే కాబోలు ఆ తెల్ల చీర వగైరా నుకున్నాను. అప్పుడు సంధ్య జ్ఞాపకం వచ్చింది. భాస్కరన్ కోరిక జ్ఞాపకం వచ్చింది. సరితను

అడిగాను సంధ్య కనిపిస్తుందా అని. అప్పుడప్పుడు కలుస్తుందని చెప్పడంతో సంతోష పడ్డాను.

"సరితా! నువ్వో చిన్న పని చేసి పెట్టాలి. నా దగ్గర భాస్కరన్ ఇచ్చిన డైరీలు, కాగితాలు ఉన్నాయి. వాటిని సంధ్యకు ముట్టచెప్పాలి." "అలాగే" అంటూ సరిత తదేకంగా నా వైపు చూడసాగింది. ఆ చూపుల్లో ఎన్నెన్నో అర్థాలు.

హనుమకొండలో రైలు ఆగింది.

రైలు దిగే ముందు సరితకు డైరీల నందిస్తూ అన్నాను:

"సరితా! నిన్నో మాట అడగాలనుంది."

"ఏమిటి, మాస్టారూ?"

"ఇంకా పెళ్ళెందుకు చేసుకోలేదు?"

"చేసుకోవా లనిపించలేదు."

"ఎవరినైనా ప్రేమించావా?"

"ఊఁ."

'ఎవరిని' అని అర్థం వచ్చేటట్లు తల ఆడించాను.

"ఎవరో చెప్పలేను. కాని అతను మాత్రం ఇప్పుడు నే నందుకోలేని స్థితిలో ఉన్నాడు. కాని, అతన్ని మాత్రం మరిచి పోలేక ఇలా ఉండిపోయాను. మాస్టారూ! స్త్రీ ఒకరిని మాత్రమే ప్రేమించ గలదు అని నే ననుకుంటాను."

"ఎవరా, ఒకరు?"

అప్పటికే సరిత రైలు దిగి కిటికీ లోంచి మాట్లాడుతూంది.

రైలు ఏ క్షణంలోనైనా కదలొచ్చు.

"ఎవరు సరితా" మళ్ళీ అడిగాను.

గార్డు విజిల్ ఇచ్చి గ్రీన్ ఫ్లాగ్ చూపిస్తున్నాడు.

"మీరు."

"సరితా!"

"మీకు తెలుసు, మాస్టారూ నాది తీరని కోరిక అని. చదివే రోజుల్లో ప్రతి క్షణం మీ కీ విషయాన్ని చెప్పాలని ఆరాటం ఉండేది. చెబుదామంటే భయం వేసేది. చెప్పాలని నిర్ణయించుకునే సరికి మీ పెళ్ళి నిశ్చయమైన సంగతి తెలిసింది. దానితో..."

రైలు మెల్లగా కదిలిపోసాగింది. సరిత కళ్ళ నిండా నీళ్ళు నిండి ఉన్నాయి. మెల్ల మెల్లగా దూరం కాసాగింది. ప్లాట్ ఫారం మీద సముద్రంలా జనసమూహం. సరిత ఆ జనసమూహంలో కలిసి పోయింది. నా ఎదలోకి ఎవరో కత్తి దించుతున్నంత నొప్పి—మూలుగుతూ వెనక్కి వాలిపోయాను.

రైలు అవుటర్ దాటి వేగాన్ని పుంజుకుంటుంటే "ఆదర్శప్రేమ" అన్నదో యుటోపియన్ కాన్సెప్ట్. ఆది మనిషి తనలో దాగి ఉన్న సెక్సువల్ ఇన్‌స్టింక్ట్‌కి..!! భాస్కరన్ మాటలు చెవుల్లో గింగురుమంటూ వినిపించినట్లు అనిపించసాగింది.

"నో! ప్రేమ యుటోపియన్ కాన్సెప్ట్ కాదు" అనుకుని కళ్ళు మూసుకున్నాను. *

# రసవద్ఘట్టాలు

**పఠాన్** సేనాపతులైన డాకర్ కేషర్‌ఖాన్‌లు రాజపుత్రస్థానంలోని కోటా సంస్థానంపై దాడిచేశారు. పఠానుల ధాటికాగలేక సంస్థానాధిపతియైన భోనాంగుడు బూంది సంస్థానంలో తలదాచుకున్నాడు. భోనాంగుని భార్య తన అన్నగారైన కైతాన్ రాజాగారింట ఉంటూ సమయం చూచుకొని పఠాన్‌లను చిత్తుచేయా లనుకున్నది.

యుద్ధం చేసి పఠాన్‌లను పారద్రోలడం వీలు కాదని గ్రహించింది. హోలీ పండుగ సందర్భంగా తాను, తనతోపాటు వందలాది రాజపుత్రస్త్రీలు పఠానుల సేనానులతో కోటా రాజధానిలో క్రీడలలో పాల్గొన దలచినట్లు కబురు పంపింది. రాజపుత్ర రమణులతో పొందుకోసం ఉవ్విళ్ళూరుతున్న పఠానులు ఉబ్బి తబ్బిబ్బయ్యారు.

భోనాంగుని భార్య మూడు వందల మంది రాజపుత్ర వీరులను ప్రోగుచేసింది. వారికి తన పథకం వివరించింది. వీరులందరూ స్త్రీ వేషాలు వేసుకున్నారు. భోనాంగుడు రాణి వేషం ధరించి వారికి నాయకత్వం వహించాడు. మూడు వందల పల్లకీలలో విచ్చేసిన రాజపుత్ర సుందరీ మణులకు పఠాన్ సర్దారులు సింహద్వారం వద్ద స్వాగతం పలికారు.

హోలీ క్రీడలు, వినోదాలు ప్రారంభమయ్యాయి. కాముకులైన పఠాన్ సైనికులు సుందరీమణులపై బుక్కాగుండను చల్లారు. సరసాలాడుతూ వసంతాలు చల్లుకుంటున్నారు. ఆటలు, పాటలు, కేరింతలు, గంతులు, శృంగార చేష్టలతో కాముకులైన పఠాన్ సేనలు పరవశించి పోతున్నాయి. ముందే ఏర్పరచుకున్న సంకేతం మేరకు భోనాంగుడు కేషర్‌ఖాన్ తలపై అబీరమను సుగంధ ద్రవ్యములతో నిండిన వసంతపు పాత్రను కుమ్మరించాడు. వెంటనే స్త్రీ వేషధారులైన రాజపుత్ర వీరులు దాచుకున్న పిడిబాకులతో పఠానులను హతమార్చారు. భోనాంగుడు డాకర్, కేషర్‌ఖాన్‌లను నేలకూల్చాడు. కోటా రాజ్యంపై భోనాంగుడు మరలా విజయ పతాకం ఎగురవేశాడు.

• • • •

ఔరంగజేబు తరవాత వచ్చిన రాజులలో రెండవ షా ఆలం మరీ బలహీనుడు. అతడు మహారాష్ట్రుల చేతి కీలుబొమ్మ. కాని హిందువుల ఆచార సంప్రదాయాలను గౌరవించే ఉదార స్వభావం గలవాడు. తనను ఎగతాళి చేసిన వారిపట్ల కూడా కోపించే వాడు కాదు.

హోలీ పండుగ వచ్చింది. ఆనందరావు నర్సీ అనే మరాటి యువకుడు తన స్నేహితునికి షా ఆలం పాదుషా వేషం వేశాడు. పాదుషా తన కూతురును ఎంతగానో ప్రేమించేవారు. తాను ఎక్కడికి పోయినా ఆమెను కూడా తీసుకుని పోయేవారు. ఆనందరావు మరో యువకునికి పాదుషా కూతురి వేషం వేశాడు. నకిలీ చక్రవర్తితోపాటు ఆమెను కూడా కూర్చుండ జేసి చక్రవర్తి పరివారం లోని వారివలె మరికొందరికి వేషం వేశాడు— నకిలీ చక్రవర్తి, అతని కూతురు, పరివారం అందరూ ఊరేగింపుగా పాదుషాగారి ప్రాసాదం ముందుకు వెళ్ళారు. షా ఆలం పాదుషా తనను అనుకరిస్తూ సాగిపోతున్న ఊరేగింపును చూచాడు. కాని ఏమాత్రం కోపగించుకోలేదు. ప్రదర్శనను నిర్వహించిన ఆనందరావు నర్సీని పిలిచి

## హోలీ క్రీడలు

అయిదు వందల రూపాయల బహుమతి నిచ్చి పంపారు.

ఈ విషయం తెలుసుకున్న మహారాష్ట్ర నాయకుడైన సింధియా మహారాజు ఆనందరావును పట్టి తెప్పించాడు. వానిని ఫిరంగి మూతికి కట్టించి పేల్చివేయా లనుకున్నాడు. ఈ సంగతి పాదుషా చెవిని పడింది. వెంటనే పాదుషా సింధియాకు కబురుచేసి ఆనందరావును క్షమించి వదలివేయమన్నాడు. సింధియా ఆనందరావును ప్రాణాలతో వదిలాడు కాని తన దేశం నుండి తరిమివేశాడు.

• • • •

అలవర్దీఖాన్ మొగల్ చక్రవర్తి ప్రతినిధిగా బెంగాల్ సుబాను పాలిస్తున్నాడు. మహారాష్ట్రులు అతనిపై విరుచుకుపడ్డారు. మహారాష్ట్ర సేనాపతి భాస్కర పండితుడు కోటి రూపాయల కప్పం చెల్లిస్తే యుద్ధం విరమించుకుంటానని వార్త పంపాడు. అలవర్దీఖాన్ అందుకు సమ్మతించక పోరాటానికే సిద్ధపడ్డాడు. ఘోరంగా యుద్ధం జరుగుతూ ఉంది.

అలవర్దీఖాన్ ఎక్కిన ఏనుగుకు ముందు మరి రెండు పెద్ద ఏనుగులు నడుస్తూ ఉండేవి. వాటి దంతాలకు లావైన గొలుసులు కట్టి ఉండేవారు. ఆ గొలుసులు పంద్రెండున్నర మణుగుల బరువు, ఇరవై అడుగుల పొడవు ఉండేవి. ఏనుగులా గొలుసులను నేలకు కొడుతూ వెళ్తున్నాయి. మహారాష్ట్రుల వింత రంగుల దుస్తులను చూసి ఆ ఏనుగులు బెదరి పోయాయి. గొలుసులను తొండాలతో తిప్పుతూ శత్రు సైన్యంపై పడ్డాయి. మహారాష్ట్ర సైనికులు బెంబేలెత్తి పరుగెత్తిపోయారు. అలవర్దీఖాన్ గండం గడిచి సమీపంలోని కట్వా కోట చేరాడు.

పరాజితులైన మహారాష్ట్రులు బాలాజీరావు నాయకత్వంలో ముర్షిదాబాద్ మీదికి దండయాత్ర సాగించారు. మరాటి సైనికులు దారిలో గ్రామాలను దోచుకుని ప్రజలను బాధింప సాగారు. మరాటీ సైనికులు భాగల్పూర్ గ్రామంలో ప్రవేశించారు. ఆ గ్రామ ప్రజలు కూడా ఇళ్ళు వాకిళ్ళు వదలి గంగానదిని దాటి అవతలి ప్రాంతాల్లో తలదాచుకున్నారు. కాని మహమ్మద్‌ఘవుస్ అనే సేనాధిపతి భార్యమాత్రం గ్రామం వదలలేదు. ఆమె భర్త ఒకప్పుడు వంగ రాష్ట్ర నవాబుగారి సైన్యానికి అధిపతిగా ఉండి, యుద్ధంలో చనిపోయిన వీరుడు. ఆమె తన బంధువులను కొందరిని ప్రోగుచేసుకుని పాడుపడిన తన ఇంటిలో దాగుకొని శత్రువులపై తుపాకీ గుళ్ళ వర్షం కురిపించసాగింది. మహారాష్ట్ర దోపిడీ గాండ్రు ఆ ఇంటిపై పడ్డారు. తుపాకి గుళ్ళకు కొందరు కూలిపోయారు. ఈ విషయం మరాటీ దండ నాయకునికి తెలిసింది. బాలాజీరావు స్వయంగా వచ్చాడు. ఆమె ఒకనాటి సేనాని భార్య అని, తమను ప్రతిఘటిస్తూ కాల్పులు సాగిస్తున్నదని తెలుసుకొన్నాడు. ఆమె ధైర్యసాహసాలకు ఆశ్చర్య పడ్డాడు. పోరాటం ఆపుచేసి ఆమెకేమాత్రం హాని కలగకుండా రక్షణ కల్పించాడు. తన సైన్యాన్ని వెనక్కి మళ్ళింపజేశాడు. గ్రామస్థులు మరలా తమ ఇళ్ళు చేరారు. శాంతి నెలకొన్నది. 1741 లో జరిగిన ఉదంతం ఇది!

**- జానమద్ది హనుమచ్ఛాస్త్రి**